

మాడాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న విప్ గువ్వల బాలరాజు

# అభివృద్ధి, సంక్షేమాలే మరోసారి గెలిపిస్తాయి

- అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

లింగాల, అక్టోబర్ 30: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని మాడాపూర్ గ్రామానికి చెందిన 20మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు లింగాలలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ప్రగల్భాలు పలికిన నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత తొమ్మిదేండ్లలో రాష్ట్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. గత పాలకులు అభివృద్ధిని పక్కకు పెట్టి ఫొటోలకు పోజులు ఇచ్చి పబ్బం గడుపుకున్నారని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అందించే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన కొత్త ఓటర్లు

అచ్చంపేట, అక్టోబర్ 30: పట్టణంలోని రెండో వార్డుకు చెందిన యువ ఓటర్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సోమవారం అచ్చంపేటలోని ఆయన నివాసగృహంలో వార్డుకు చెందిన కొత్త ఓటర్లు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# చెక్ పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిఘానేత్రాల సమక్షంలో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన ఆరు సాధారణ చెక్ పోస్టులు, ఒకటి ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టు, ఐదు ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టుల వద్ద వాహనాలను 24 గంటలపాటు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఇందులోల భాగంగా ఆదివాం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ముగ్గురి నుంచి రూ.2,73,500 నగదు సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వైభవ్ రఘునాథ్ తెలిపారు. అదేవిధంగా 16 లిక్కర్ కేసులు చేసి 138.09 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, అందులో అందులో 45.50 లీటర్ల సారా, 92.58 లీటర్ల బీర్లు, ఐఎంఎఫ్‌ఎల్ సీజ్ చేయడం జరిగిందన్నారు. సీజ్ చేసిన లిక్కర్ విలువ రూ. 58,720 ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

# ప్రజల ఎజెండానే బీఆర్‌ఎస్ ఎజెండా

- సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- మూడు గంటల కరెంట్ కావాలా.. 24 గంటలు కావాలా..?
- కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మొద్దు
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- కోడేరులో ఆత్మీయ సమ్మేళనం



బీఆర్‌ఎస్‌లో చేరిన మరికల్ కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు, అక్టోబర్ 30 : తెలంగాణ ప్రజల ఎజెండానే బీఆర్‌ఎస్ ఎజెండా అని, పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పరితపించే నాయకుడు సీఎం కేసీఆర్ అని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పార్టీ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీరం మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఎజెండానే బీఆర్‌ఎస్ పార్టీ ఎజెండా అని పేదల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందే విధంగా రూపకల్పన చేసి ఆచరణలో అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా గుర్తింపు పొందిందన్నారు. రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రజలను పీడించినా రైతు బంధు, రైతుబీమా వంటి పథకాలను నిలుపుదల చేయకుండా అమలు చేసిన ప్రభుత్వం మన తెలంగాణ ఒక్కటేనని వెల్లడించారు. కరోనా కాలంలో కనబడని కొందరు ప్యారాచ్యూట్ నాయకులు ఎన్నికలు వచ్చే సరికి అధికారంలో కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ అధికారాన్ని అనుభవించి కేసులు పెట్టి జైలుకు పంపిన వాళ్లు పెట్టే ప్రలోభాలకు లొంగి కొందరు బైటికి వెళ్తున్నారని వాళ్లు 100 మందిని తీసుకెళ్తే మనం వెయ్యి మందిని చేర్చుకుంటామన్నారు. ప్రలోభాలకు లొంగి పార్టీ మారే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కొల్లాపూర్ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదన్నారు. జాతీయ రహదారి, సోమశిల సిద్ధేశ్వరం వంతెన, ఉద్యావన కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, మామిడి మార్కెట్, డయాలసిస్ సెంటర్, ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, రెవెన్యూ కార్యాలయాలు వంటి అభివృద్ధి పథకాలను మంజూరుయ్యాయని గుర్తు చేశారు. 18 ఏండ్లు కొల్లాపూర్‌ను పరిపాలించిన ప్యారాచూట్ నాయకుడు మాజీ మంత్రి జూపల్లి ఏం అభివృద్ధి చేశారో ప్రజలు నిలదీయాలని సూచించారు. మంత్రిగా ఉండి కొల్లాపూర్ ప్రాంతాన్ని ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకే గత ఎన్నికల్లో ప్రజలు ఓడించారని అయినా నాలుగున్నర ఏండ్ల పాటు అధికార పార్టీలో ఉండి పార్టీ నాయకులను కార్యకర్తలను మోసం చేసి నేడు కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ నేతలు కర్ణాటకలో 5గంటల కరెంటు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, మూడు గంటలు కరెంట్ ఇచ్చే పార్టీ కావాలా? 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు, రైతులు ఆలోచించుకోవాలని సూచించారు. మోసపోతే గోసపడతామని, అభివృద్ధి కోసం పరితపించే నాయకులకు ప్రజలు అండగా నిలబడి ఆశీర్వదించాలని బీరం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాష్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, విండో చైర్మన్లు చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి, రుక్మారెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చారెడ్డి, విండో డైరెక్టర్లు జగన్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..

కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి, అక్టోబర్ 30 : ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డుకు చెందిన 20 మంది మైనార్టీ యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు పాషా, హుస్సేన్ తదితరులున్నారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలంలోని కల్వకోలులో 100 మంది, మరికల్‌కు చెందిన వంద మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాసులు, రాజాగౌడ్, గణేశ్‌రావు, రాముయాదవ్, గిరిప్రసాద్ ఉన్నారు. అలాగే పెంట్లవెల్లి మండలంలోని ఎంగంపల్లితండా చెందిన 100 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరిని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో బీరం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. కొడేరు మండలం కేంద్రంతోపాటు కొండ్రావుపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బీరం సమక్షంలో గులాబీగూటికి చేరారు.



చుక్కాపూర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# మరోమారు ఆశీర్వదించండి

- అభివృద్ధిలో నియోజకవర్గాన్ని అగ్రగామిని నిలుపుతా..
- కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మొద్దు
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఆమనగల్లు, తలకొండపల్లి మండలంలో ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు, అక్టోబర్ 30 : కల్వకుర్తి ఎమ్మెల్యేగా మరో మారు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సంకటోనిపల్లి, బీసీ కాలనీలలో, 10వ వార్డు విఠాయిపల్లిలో, రాముసుంతల గ్రామాల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 8వ వార్డులో నిర్వహించిన ప్రచారంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ గోళి శ్రీనివాస్ రెడ్డి, 10వ వార్డు విఠాయిపల్లి, రాముసుంతలలో నిర్వహించిన ప్రచారంలో అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ వారంటీ లేని కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వస్తుందని, మోసపోతే గోసపడుతామని గుర్తు చేశారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలు ఇక్కడ అమలు చేస్తామని చెప్పడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ కాదా అని గుర్తు చేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించిన రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. మూడో సారి అధికారంలోకి వస్తే ఎకరానికి రూ. 16 వేల పెట్టుబడి, ఆసరా పింఛన్లు రూ.5,016, సౌభాగ్యలక్ష్మి పథకంతో తెల్లరేషన్‌కార్డు ఉండి అర్హత కలిగిన మహిళకు రూ.3 వేలు, కేసీఆర్ బీమా పథకం, దళితబంధు, గృహలక్ష్మి, పథకాలు అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేనావత్ అనురాధ, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, గంథ్రాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ కమటం రాధమ్మ, మండల , మున్సిపల్ అధ్యక్షులు అర్జున్‌రావు, నేనావత్ పత్యానాయక్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నిట్ట నారాయణ, ఎంపీటీసీలు సరిత, దోనాదుల కుమార్, సర్పంచ్ సోన, బీఆర్‌ఎస్ సీనియర్ నా యకులు సయ్యద్ ఖలీల్, చుక్క నిరంజన్ గౌడ్, కమఠం వెంకటయ్య, సురమల్ల సుభాష్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### సహకార సంఘాలు బలోపేతం

బీఆర్‌ఎస్ హయాంలోనే సహకార సంఘాలు బలోపేతం అయ్యావని ఎమ్మెల్యే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆమనగల్లు లో డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ అధ్యక్షతన కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల సహకార సంఘాల పాలకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల సేవలను అందించటంలో సహకార సంఘాలు ముందున్నాయని వివరించారు. అనంతరం సహకార సంఘాల పాలక వర్గాలు ఎమ్మెల్యేకు మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు జనార్ధన్‌రెడ్డి, భాస్కర్ రావు, దుర్గయ్య, తిరుమల్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు శేఖర్, సత్యం, రాజవర్ధన్, రవి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

### కల్వకుర్తిని అభివృద్ధి చేసుకుందాం

తలకొండపల్లి, అక్టోబర్ 30 : బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు 30రోజుల పాటు కష్టపడి తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని చుక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చుక్కాపూర్‌తోపాటు యడవెల్లి, చెన్నారం, పాతకోట తండా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఎంపీపీ నిర్మల, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నర్సింహతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.